# {అపార కరుణామయుడైన అల్లాహ్ అర్ష్‌పై అధిష్ఠించాడు}

"26 దుల్ హిజ్జా 1447 హిజ్రీ, తదనుగుణంగా 12 / 06 / 2026 తేదీన

ప్రసారం మరియు పంపిణీ చేయబడిన శుక్రవారం ఖుత్బా"

ఇన్నల్ హమ్ద లిల్లాహి, నహ్మదుహూ వ నస్తఈనుహూ వ నస్తగ్ఫిరుహ్, వ నవూజు బిల్లాహి మిన్ షురూరి అన్ఫుసినా వ మిన్ సయ్యిఆతి ఆమాలినా, మన్ యహ్దిహిల్లాహు ఫలా ముదిల్ల లహ్, వ మన్ యుద్లిల్ ఫలా హాదియ లహ్, వ అష్హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లా షరీక లహ్, వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహ్.

యా అయ్యుహల్లజీన ఆమనుత్తఖుల్లాహ హక్ఖ తుఖాతిహీ వలా తమూతున్న ఇల్లా వ అంతుమ్ ముస్లిమూన్.

అమ్మా బాద్

ఓ ముస్లింలారా!

నిశ్చయంగా అల్లాహ్ యొక్క సృష్టిని గురించి ఆలోచించడం, మరియు ఆయన షరియత్ వాక్యాలను (ఆయాత్) శ్రద్ధగా ధ్యానించడం వల్ల ఈమాన్ (విశ్వాసం) పెరుగుతుంది మరియు యకీన్ (నమ్మకం) బలపడుతుంది. ఎందుకంటే సృష్టి యొక్క గొప్పతనం మరియు దాని అందమైన నిర్మాణం, సృష్టికర్త యొక్క గొప్పతనానికి మరియు ఆయన అద్భుతమైన నైపుణ్యానికి నిదర్శనం.

అల్లాహ్ తాలా ఇలా సెలవిచ్చాడు:

إِنَّ فِي خَلْقِ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَاخْتِلَافِ اللَّيْلِ وَالنَّهَارِ لَآيَاتٍ لِأُولِي الْأَلْبَابِ

భావం: "నిశ్చయంగా ఆకాశాలు మరియు భూమి సృష్టిలో, రాత్రి పగళ్ల మార్పులలో వివేకవంతులకు అనేక నిదర్శనాలు ఉన్నాయి." (ఆల్ ఇమ్రాన్: 190)

## అల్లాహ్ యొక్క కుర్సీ (పీఠం) వైభవం

అల్లాహ్ యొక్క గొప్ప సృష్టితాలలో ఆయన కుర్సీ – పీఠం ఒకటి. దీనిని వర్ణిస్తూ అల్లాహ్ తాలా ఇలా అన్నాడు:

وَسِعَ كُرْسِيُّهُ السَّمَاوَاتِ وَالْأَرْضَ

భావం: "ఆయన కుర్సీ భూమ్యాకాశాలను పరివేష్ఠించి ఉంది. (అల్–బఖరా: 255)

'కుర్సీ' అంటే అల్లాహ్ తాలా యొక్క పాదాలు ఉంచే స్థలం. ఇబ్న్ అబ్బాస్ (రజియల్లాహు అన్హుమా) ఇలా అన్నారు: (కుర్సీ అనేది ఆయన పాదాల స్థలం, మరియు అర్ష్ యొక్క వైశాల్యాన్ని ఎవరూ అంచనా వేయలేరు). [దీనిని ఇమామ్ హాకిమ్ ఉల్లేఖించారు, సహీహ్ అని ధృవీకరించారు మరియు ఇమామ్ జహబీ దీనితో ఏకీభవించారు].

**ఖురాన్‌లోని అత్యంత గొప్ప ఆయత్**

ఈ కుర్సీ పేరు మీదే అల్లాహ్ గ్రంథం (ఖురాన్) లోని అత్యంత గొప్ప ఆయత్ (ఆయతుల్ కుర్సీ) కి ఆ పేరు వచ్చింది.

ఉబై బిన్ కఅబ్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అడిగారు:

»يَا أَبَا الْمُنْذِرِ! أَتَدْرِي أَيُّ آيَةٍ مِنْ كِتَابِ اللَّهِ مَعَكَ أَعْظَمُ؟«

"ఓ అబూ ముంజిర్! నీ వద్ద ఉన్న అల్లాహ్ గ్రంథంలోని ఆయత్‌లలో ఏది అత్యంత గొప్పదో నీకు తెలుసా?"

నేను (ఉబై): "అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకే బాగా తెలుసు" అన్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) మళ్ళీ అడిగారు:

»يَا أَبَا الْمُنْذِرِ! أَتَدْرِي أَيُّ آيَةٍ مِنْ كِتَابِ اللَّهِ مَعَكَ أَعْظَمُ؟«

"ఓ అబూ ముంజిర్! నీ వద్ద ఉన్న అల్లాహ్ గ్రంథంలోని ఆయత్‌లలో ఏది అత్యంత గొప్పదో నీకు తెలుసా?"

అప్పుడు నేను ఇలా అన్నాను:

اللَّهُ لَا إِلَهَ إِلَّا هُوَ الحَيُّ القَيُّومُ

భావం: "అల్లాహ్! ఆయన తప్ప మరొక నిజ ఆరాధ్యుడు లేడు, ఆయన సజీవుడు మరియు సర్వసృష్టిని పరిపాలించేవాడు (ఆయతుల్ కుర్సీ ప్రారంభం)."

అప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నా ఛాతీపై మెల్లగా తట్టి ఇలా అన్నారు:

»وَاللَّهِ! لِيَهْنِكَ العِلْمُ أَبَا المُنْذِرِ«

"అల్లాహ్ తోడు! ఓ అబల్ ముంజిర్, నీకు ఈ మహత్తర జ్ఞానం లభించినందుకు అభినందనలు." [సహీహ్ ముస్లిం]

అల్లాహ్ దాసులారా! అల్లాహ్ యొక్క 'కుర్సీ' (పీఠం) అంతటి గొప్ప స్థానాన్ని పొంది, ఏడు ఆకాశాలను మరియు భూములను తనలో ఇమిడ్చుకున్నట్లయితే... మరి మన ప్రభువు తన ఘనతకు మరియు వైభవానికి తగినట్లుగా అధిష్టించిన ఆ 'రహ్మాన్' (కరుణామయుడి) యొక్క అర్ష్ దానికంటే ఎంతో పెద్దది మరియు ఎంతో గొప్పది అని తెలుసుకోండి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

الرَّحْمَنُ عَلَى الْعَرْشِ اسْتَوَى

"ఆ కరుణామయుడు (అల్లాహ్) అర్ష్‌పై అధిష్టించాడు." (సూరా తాహా: 5)

మరియు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَهُوَ الَّذِي خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ فِي سِتَّةِ أَيَّامٍ وَكَانَ عَرْشُهُ عَلَى الْمَاءِ

"మరియు ఆయనే ఆకాశాలను, భూమిని ఆరు రోజుల్లో సృష్టించాడు; అప్పుడు ఆయన అర్ష్ నీటిపై ఉండింది." (సూరా హూద్: 7)

అల్లాహ్ తన గ్రంథంలో అనేక చోట్ల తన 'అర్ష్' గురించి ప్రస్తావించాడు. దాని గొప్పతనాన్ని వర్ణిస్తూ ఇలా అన్నాడు:

اللَّهُ لَا إِلَهَ إِلَّا هُوَ عَلَيْهِ تَوَكَّلْتُ وَهُوَ رَبُّ الْعَرْشِ الْعَظِيمِ

"అల్లాహ్ తప్ప ఆరాధనకు నిజమైన అర్హుడు మరెవ్వరూ లేరు, నేను ఆయనపైనే భరోసా ఉంచాను, మరియు ఆయనే మహా ఘనమైన అర్ష్‌కి ప్రభువు." (సూరా అత్-తౌబా: 129)

మరియు అది ఎంతో గౌరవప్రదమైనదని, అత్యున్నతమైన మరియు గొప్ప గుణాలను కలిగి ఉందని వర్ణిస్తూ ఇలా అన్నాడు:

فَتَعَالَى اللَّهُ الْمَلِكُ الْحَقُّ لَا إِلَهَ إِلَّا هُوَ رَبُّ الْعَرْشِ الْكَرِيمِ

"నిజమైన పాలకుడైన అల్లాహ్ అత్యున్నతుడు, ఆయన తప్ప ఆరాధనకు నిజమైన అర్హుడు మరెవ్వరూ లేరు, ఆయనే గౌరవప్రదమైన అర్ష్‌కి ప్రభువు." (సూరా అల్-ముమినూన్: 116)

## అర్ష్ యొక్క పరిమాణం

గౌరవనీయులైన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు అర్ష్ యొక్క పరిమాణం మరియు అది ఎంత భారీగా ఉంటుందో తెలియజేశారు.

హజ్రత్ అబూ జర్ (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం ప్రకారం, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:

«يَا أَبَا ذَرٍّ، مَا السَّمَاوَاتُ السَّبْعُ مَعَ الْكُرْسِيِّ إِلَّا كَحَلْقَةٍ مُلْقَاةٍ بِأَرْضٍ فَلَاةٍ، وَفَضْلُ الْعَرْشِ عَلَى الْكُرْسِيِّ كَفَضْلِ الْفَلَاةِ عَلَى الْحَلْقَةِ»

"ఓ అబూ జర్! 'కుర్సీ' (పీఠం) తో పోలిస్తే ఏడు ఆకాశాల పరిమాణం ఒక విశాలమైన ఎడారిలో పడేసిన ఒక చిన్న ఉంగరం (లేదా వలయం) లాంటిది మాత్రమే. మరియు కుర్సీతో పోలిస్తే 'అర్ష్' యొక్క గొప్పతనం, ఆ చిన్న ఉంగరంతో పోలిస్తే ఆ విశాలమైన ఎడారి ఎంత పెద్దదో అంతటి గొప్పది." (ఇబ్న్ హిబ్బాన్ తన సహీహ్ లో ఉల్లేఖించారు)

## సృష్టి యొక్క పైకప్పు

అర్ష్ అనేది సమస్త సృష్టికి పైకప్పు లాంటిది. హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) ఉల్లేఖించిన హదీసులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:

»فَإِذَا سَأَلْتُمُ اللَّهَ فَسَلُوهُ الْفِرْدَوْسَ، فَإِنَّهُ أَوْسَطُ الْجَنَّةِ، وَأَعْلَى الْجَنَّةِ، وَفَوْقَهُ عَرْشُ الرَّحْمَنِ، وَمِنْهُ تَفَجَّرُ أَنْهَارُ الْجَنَّةِ«

"మీరు అల్లాహ్‌ను వేడుకున్నప్పుడు 'జన్నతుల్ ఫిరదౌస్' ను కోరండి. ఎందుకంటే అది స్వర్గం యొక్క మధ్య భాగం మరియు అత్యున్నతమైన భాగం. దానిపైనే 'రహ్మాన్' (కరుణామయుడి) యొక్క అర్ష్ ఉంది, మరియు అక్కడ నుండే స్వర్గపు నదులు ప్రవహిస్తాయి." (సహీహ్ బుఖారీ)

## అత్యంత బరువైన సృష్టి

ఇది అన్ని సృష్టితాలలోకెల్లా అత్యంత బరువైనది. హదీసులో ఇలా వచ్చింది:

»سُبْحَانَ اللَّهِ وَبِحَمْدِهِ، عَدَدَ خَلْقِهِ، وَرِضَا نَفْسِهِ، وَزِنَةَ عَرْشِهِ، وَمِدَادَ كَلِمَاتِهِ«

"అల్లాహ్ పవిత్రుడు, ఆయన సృష్టితాల  సంఖ్య అంత, ఆయన ప్రసన్నత అంత, ఆయన అర్ష్ యొక్క బరువు అంత, మరియు ఆయన మాటల సిరా అంత స్తుతులు ఆయనకే చెల్లును." (హజ్రత్ జువైరియా రజియల్లాహు అన్హా ద్వారా సహీహ్ ముస్లిం ఉల్లేఖన)

షైఖుల్ ఇస్లాం ఇబ్న్ తైమియా (రహిమహుల్లాహ్) దీనిపై మాట్లాడుతూ: "అర్ష్ యొక్క బరువు అన్ని బరువుల కంటే అత్యంత భారీ రకానికి చెందినదని ఈ హదీస్ స్పష్టం చేస్తోంది" అన్నారు.

## అర్ష్ యొక్క స్తంభాలు

అల్లాహ్ దాసులారా! నిశ్చయంగా అల్లాహ్  అర్ష్ నిలబడటానికి దానికి స్తంభాలను ఏర్పరిచాడు.

హజ్రత్ అబూ సయీద్ అల్-ఖుద్రీ (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:

»لَا تُخَيِّرُوا بَيْنَ الأَنْبِيَاءِ، فَإِنَّ النَّاسَ يَصْعَقُونَ يَوْمَ القِيَامَةِ، فَأَكُونُ أَوَّلَ مَنْ تَنْشَقُّ عَنْهُ الأَرْضُ، فَإِذَا أَنَا بِمُوسَى آخِذٌ بِقَائِمَةٍ مِنْ قَوَائِمِ العَرْشِ، فَلَا أَدْرِي أَكَانَ فِيمَنْ صَعِقَ، أَمْ حُوسِبَ بِصَعْقَةِ الأُولَى«

"ప్రవక్తల మధ్య (ఎవరు గొప్ప అనే విషయమై) భేదాలు లేదా ప్రాధాన్యతలు ఎంచుకోకండి. ఎందుకంటే తీర్పు దినమున ప్రజలందరూ స్పృహ తప్పి పడిపోతారు. అప్పుడు భూమి చీల్చుకుని అందరికంటే ముందుగా బయటకు వచ్చేది నేనే అవుతాను. నేను రాగానే, మూసా (అలైహిస్సలాం) అర్ష్ యొక్క స్తంభాలలో ఒక స్తంభాన్ని పట్టుకుని నిలబడి ఉండటం చూస్తాను. అయితే ఆయన కూడా స్పృహ తప్పి పడిపోయి నాకంటే ముందు మేల్కొన్నాడా, లేదా పూర్వం (దునియాలో తూర్ పర్వతంపై) వచ్చిన స్పృహతప్పుదలకు బదులుగా ఇక్కడ మినహాయించబడ్డాడా అనేది నాకు తెలియదు." (బుఖారీ & ముస్లిం ఏకీభవించిన హదీస్)

మరియు నిశ్చయంగా అల్లాహ్ తన అర్ష్‌ను మోయడానికి గౌరవనీయులైన మలాయికహ్ (దైవదూతలను) నియమించాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَيَحْمِلُ عَرْشَ رَبِّكَ فَوْقَهُمْ يَوْمَئِذٍ ثَمَانِيَةٌ

"మరియు ఆ రోజు నీ ప్రభువు అర్ష్‌ని తమపై ఎనిమిది మంది (దైవదూతలు) మోస్తారు." (సూరా అల్-హాఖ్ఖః: 17)

ఆ దైవదూతల సృష్టి ఎంతటి బృహత్తరమైనదో అల్లాహ్ కు తప్ప మరెవ్వరికీ తెలియదు. అల్లాహ్ తలా ఇలా సెలవిచ్చాడు:

الَّذِينَ يَحْمِلُونَ الْعَرْشَ وَمَنْ حَوْلَهُ يُسَبِّحُونَ بِحَمْدِ رَبِّهِمْ وَيُؤْمِنُونَ بِهِ وَيَسْتَغْفِرُونَ لِلَّذِينَ آمَنُوا

"ఎవరైతే అర్ష్‌ను మోస్తున్నారో మరియు దాని చుట్టూ ఉన్నారో, వారు తమ ప్రభువు యొక్క పవిత్రతను కొనియాడుతూ స్తుతిస్తారు, ఆయనను విశ్వసిస్తారు మరియు విశ్వసించిన వారి కొరకు క్షమాపణలు వేడుకుంటారు." (సూరా గాఫిర్: 7)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజియల్లాహు అన్హుమా) ఉల్లేఖనం ప్రకారం, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:

»أُذِنَ لِي أَنْ أُحَدِّثَ عَنْ مَلَكٍ مِنْ مَلَائِكَةِ اللَّهِ مِنْ حَمَلَةِ الْعَرْشِ، إِنَّ مَا بَيْنَ شَحْمَةِ أُذُنِهِ إِلَى عَاتِقِهِ مَسِيرَةُ سَبْعِ مِائَةِ عَامٍ«

"అర్ష్‌ను మోసే అల్లాహ్ దూతలలో ఒక దూత గురించి మాట్లాడటానికి నాకు అనుమతి ఇవ్వబడింది. అతని చెవి తమ్మె (Earlobe) నుండి అతని భుజం వరకు ఉన్న దూరం (ప్రయాణించడానికి) ఏడు వందల సంవత్సరాల కాలం పడుతుంది." (అబూ దావూద్, అల్బానీ దీనిని సహీహ్ అన్నారు)

## అర్ష్ యొక్క విశిష్టతలు

ఓ ముస్లింలారా! అల్లాహ్ తన అర్ష్(సింహాసనాని)కి అనేక ప్రత్యేకతలను ఇచ్చాడు మరియు దానిని గొప్ప విశిష్టతలతో గౌరవించాడు. అందులో ఒకటి: అల్లాహ్ సృష్టిని సృష్టించడానికంటే ముందే ఒక నిబంధన/ఒప్పందాన్ని రాసి, దానిని మరింత దృఢపరచడానికి అర్ష్ పైనే ఉంచాడు.

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం ప్రకారం, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:

»إِنَّ اللَّهَ كَتَبَ كِتَابًا قَبْلَ أَنْ يَخْلُقَ الخَلْقَ: إِنَّ رَحْمَتِي سَبَقَتْ غَضَبِي، فَهُوَ مَكْتُوبٌ عِنْدَهُ فَوْقَ العَرْشِ«

"నిశ్చయంగా అల్లాహ్ సృష్టిని సృష్టించడానికంటే ముందే ఒక గ్రంథాన్ని రాశాడు: 'నిశ్చయంగా నా కారుణ్యం, నా కోపంపై విజయం సాధించింది (ముందుంటుంది)'. ఇది ఆయన వద్ద అర్ష్‌పై వ్రాయబడి ఉంది." (సహీహ్ బుఖారీ)

మరియు అల్లాహ్  అర్ష్‌కు ప్రసాదించిన ప్రత్యేకతలలో మరొకటి: ఆయన 'షుహదా' (అల్లాహ్ మార్గంలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల) ఆత్మలు స్వేచ్ఛగా విహరించడానికి మరియు విశ్రాంతి తీసుకోవడానికి అర్ష్‌కు వేలాడదీసిన దీపాలను (లాంతర్లను) ఏర్పాటు చేశాడు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం ప్రకారం, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అమరవీరుల గురించి ఇలా సెలవిచ్చారు:

»أَرْوَاحُهُمْ فِي جَوْفِ طَيْرٍ خُضْرٍ، لَهَا قَنَادِيلُ مُعَلَّقَةٌ بِالْعَرْشِ، تَسْرَحُ مِنَ الْجَنَّةِ حَيْثُ شَاءَتْ، ثُمَّ تَأْوِي إِلَى تِلْكَ الْقَنَادِيلِ«

"వారి (షుహదాల) ఆత్మలు పచ్చని పక్షుల శరీరాలలో ఉంటాయి. వాటి కోసం అర్ష్‌కు వేలాడదీసిన దీపాలు ఉన్నాయి. అవి స్వర్గంలో తమకు నచ్చిన చోటల్లా విహరిస్తాయి, ఆపై తిరిగి ఆ దీపాల వద్దకే వచ్చి విశ్రాంతి తీసుకుంటాయి." (సహీహ్ ముస్లిం)

కాబట్టి, అల్లాహ్ అత్యంత పవిత్రుడు మరియు స్తుతులకు అర్హుడు. ఆయనే సర్వాధికారి, అత్యున్నతుడు, ఘనత మరియు గౌరవాలకు అధిపతి, గొప్పతనం మరియు వైభవానికి యజమాని. అల్లాహ్ ఈ మహా ఘనమైన ఖురాన్ ద్వారా నన్ను, మిమ్మల్ని ఆశీర్వదించు గాక! మరియు ఇందులో ఉన్న ఆయత్‌లు, హితబోధల ద్వారా మనందరికీ ప్రయోజనం చేకూర్చు గాక! నేను ఈ మాటలు చెప్తూ, నా కొరకు మరియు మీ కొరకు ప్రతి పాపం నుండి అల్లాహ్ యొక్క క్షమాపణను వేడుకుంటున్నాను మరియు ఆయన వైపే మళ్లుతున్నాను. కాబట్టి మీరు కూడా ఆయననే క్షమాపణ వేడండి మరియు ఆయన వైపునకే పశ్చాత్తాపపడండి; నిశ్చయంగా ఆయన ఎంతో క్షమించేవాడు, అత్యంత కరుణామయుడు.

## రెండవ ఖుత్బా

సమస్త స్తుతులు సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌కే చెల్లును. అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు మరెవ్వరూ లేరని, ఆయన ఏకైకుడని మరియు ఆయనకు ఎలాంటి భాగస్వామి లేడని నేను సాక్ష్యమిస్తున్నాను. మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ యొక్క దాసుడు మరియు ఆయన ప్రవక్త అని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను. అల్లాహ్ యొక్క కారుణ్యం, శాంతి శుభాలు ప్రవక్తపై, వారి కుటుంబీకులపై మరియు వారి సహచరులందరిపై వర్షించుగాక!

**అటు తర్వాత:**

నేను మీకు మరియు నాకు కూడా అల్లాహ్ పట్ల భయభక్తులు (తఖ్వా) కలిగి ఉండాలని వసియ్యత్ (హితబోధ) చేస్తున్నాను. ఎందుకంటే ఎవరైతే అల్లాహ్ కు  భయపడతారో, అల్లాహ్ వారిని రక్షిస్తాడు, పాపాల నుండి కాపాడుతాడు మరియు తన ఆశ్రయాన్ని ప్రసాదిస్తాడు. అల్లాహ్ తలా ఇలా సెలవిచ్చాడు:

يَاأَيُّهَا الَّذِينَ آمَنُوا إِنْ تَتَّقُوا اللَّهَ يَجْعَلْ لَكُمْ فُرْقَانًا وَيُكَفِّرْ عَنْكُمْ سَيِّئَاتِكُمْ وَيَغْفِرْ لَكُمْ وَاللَّهُ ذُو الْفَضْلِ الْعَظِيمِ

"ఓ విశ్వసించినవారలారా! ఒకవేళ మీరు అల్లాహ్‌కు భయపడితే, ఆయన మీకు (మంచి చెడులను వేరుచేసే) విచక్షణ జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు, మీ పాపాలను క్షమిస్తాడు మరియు మిమ్మల్ని మన్నిస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ అపరిమితమైన అనుగ్రహం గలవాడు." (సూరా అల్-అన్ఫాల్: 29)

## అర్ష్‌పై అల్లాహ్ అధిష్ఠానం (ఇస్తివా)

ఓ ముస్లింలారా! మన ప్రభువు తన గ్రంథంలో స్పష్టంగా ప్రకటించిన విషయం, ప్రవక్త హదీసుల ద్వారా నిరంతరాయంగా (తవాతుర్) నిరూపితమైన విషయం మరియు అహ్లే సున్నత్ వల్ జమాఅత్ ఏకీభవించిన (ఇజ్మా) విశ్వాసం ఏమిటంటే:

అల్లాహ్ తలా తన అర్ష్ పై ఇస్తివా అయ్యాడు (అంటే: అధిష్టించాడు). అయితే ఈ అధిష్ఠానం ఆయన ఘనతకు మరియు వైభవానికి తగినట్లుగా ఉంటుంది, సృష్టించబడిన జీవుల అధిష్ఠానం లాంటిది ఎంతమాత్రం కాదు. అల్లాహ్ తలా ఇలా సెలవిచ్చాడు:

لَيۡسَ كَمِثۡلِهِۦ شَيۡءٞۖ وَهُوَ ٱلسَّمِيعُ ٱلۡبَصِيرُ

"ఆయన పోలిక కలిగినది ఏదీ లేదు. మరియు ఆయనే అంతా వినేవాడు, చూసేవాడు." (సూరా అష్-షూరా: 11)

కాబట్టి అల్లాహ్ తన అర్ష్ పైనే ఉన్నాడు, మరియు ఆయన అర్ష్ ఆకాశంలో ఆయన సృష్టికి పైన ఉంది.

## ఇమామ్‌ల మరియు సలఫ్‌ల విశ్వాసం

ఇదే ఈ ఉమ్మత్ యొక్క సలఫ్ (ధార్మిక పూర్వీకుల) మరియు వారిలోని ఉత్తముల విశ్వాసం. నలుగురు ప్రముఖ ఇమామ్‌లు కూడా ఇదే మార్గంలో నడిచారు.

ఇమామ్ అల్-ఔజాయీ (రహిమహుల్లాహ్) అన్నారు: "మేము మరియు మా కాలంలోని తాబయీలు (సహాబాల శిష్యులు) పెద్ద సంఖ్యలో ఉన్నప్పుడు ఇలా అనేవాళ్లం: 'నిశ్చయంగా అల్లాహ్ తలా తన అర్ష్ పైనే ఉన్నాడు. మరియు సున్నత్‌లో వచ్చిన ఆయన గుణగణాలన్నింటినీ మేము అలాగే విశ్వసిస్తాము'."

ఇమామ్ అబూ హనీఫా (రహిమహుల్లాహ్) అన్నారు: "అల్లాహ్ కు ఎలాంటి అవసరం లేకపోయినా ఆయన అర్ష్‌పై అధిష్టించాడని మేము ఒప్పుకుంటాము (విశ్వసిస్తాము)."

ఇమామ్ మాలిక్ (రహిమహుల్లాహ్)ను 'అల్లాహ్ ఎలా అధిష్టించాడు?' అని అడిగినప్పుడు ఆయన ఇలా అన్నారు: "ఇస్తివా (అధిష్టించడం) అనేది తెలిసిన విషయమే (భాషాపరంగా), కానీ అది 'ఎలా' జరిగింది అనేది అగోచరం (మాకు తెలియదు), దాని గురించి ప్రశ్నించడం బిద్అత్ (సరికొత్త ఆచారం)."

ఇమామ్ షాఫయీ (రహిమహుల్లాహ్) అన్నారు: "నేను ఏ సున్నత్ (విశ్వాసం) పై ఉన్నానో, మరియు సుఫ్యాన్ (అస్-సౌరీ), మాలిక్ వంటి నేను చూసిన ప్రముఖ పండితులు ఏ విశ్వాసంపై ఉన్నారో అది ఇదే: 'అల్లాహ్ తప్ప ఆరాధనకు నిజమైన అర్హుడు మరెవ్వరూ లేరని, ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త అని సాక్ష్యమివ్వడం, మరియు అల్లాహ్ ఆకాశంలో తన అర్ష్ పైనే ఉన్నాడని విశ్వసించడం'."

ఇమామ్ అహ్మద్ బిన్ హన్బల్ (రహిమహుల్లాహ్) అన్నారు: "ఏడు ఆకాశాలకు పైన కుర్సీ, అర్ష్ మరియు లౌహె మహ్‌ఫూజ్ ఉన్నాయని పండితులందరికీ తెలిసిన విషయమే."

కాబట్టి, ఎవరైతే ఖురాన్ మరియు సున్నత్‌ను గట్టిగా పట్టుకుని, అల్లాహ్ తన గురించి వర్ణించిన గుణాలను మరియు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలియజేసిన విషయాలను (అర్థాలను మార్చకుండా, తిరస్కరించకుండా, పోల్చకుండా) అలాగే విశ్వసిస్తారో, వారే నిజమైన భాగ్యవంతులు.

## దుఆ (ప్రార్థన)

ఓ అల్లాహ్! ముస్లిం పురుషులను, ముస్లిం స్త్రీలను, వారిలో జీవించి ఉన్నవారిని మరియు మరణించిన వారిని అందరినీ క్షమించు.

ఓ మా ప్రభువా! మా నుండి ఆపదలను, మహమ్మారులను, కష్టాలను మరియు బాధలను తొలగించు. మాపై నీ అనుగ్రహాలను నిరంతరం కురిపించు, మా నుండి నీ ఆగ్రహాన్ని దూరం చేయి. మా ఆత్మలను పరిశుద్ధం చేయి, ఆత్మలను పరిశుద్ధం చేసేవారిలో నీవే అత్యుత్తముడవు.

ఓ మా ప్రభువా! మాకు ఇహలోకంలోనూ మేలును ప్రసాదించు, పరలోకంలోనూ మేలును ప్రసాదించు మరియు మమ్మల్ని నరకాగ్ని శిక్ష నుండి రక్షించు.

ఓ అల్లాహ్! కువైట్ దేశాన్ని మరియు అక్కడి ప్రజలను ప్రతి చెడు నుండి, కీడు నుండి కాపాడు. ఈ దేశాన్ని మరియు మిగిలిన ముస్లిం దేశాలన్నింటినీ శాంతిభద్రతలతో, ప్రశాంతతతో విలసిల్లేలా చేయి.

ఓ అల్లాహ్! సరిహద్దుల్లో కాపలా కాస్తున్న మా సోదరులను, భద్రతా దళాలను, రక్షణ శాఖను, నేషనల్ గార్డ్స్‌ను మరియు దేశ భద్రత కోసం శ్రమిస్తున్న వారందరినీ రక్షించు, వారి పాదాలను స్థిరంగా ఉంచు.

ఓ అల్లాహ్! మా అమీర్ (పాలకుడు) మరియు అతని యువరాజు (వలీ అహద్) లకు నీవు ఇష్టపడే, రాజీ పడే పనులు చేసే భాగ్యాన్ని ప్రసాదించు, వారిని పుణ్యకార్యాల వైపు మరియు దైవభీతి వైపు నడిపించు.

**వ ఆఖిరు దవానా అనిల్ హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్.**

**మరియు మా చివరి ప్రార్థన: సమస్త స్తుతులు సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌కే చెల్లును**